పంచ రామాలకు ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

మియాపూర్, అక్టోబర్ 29: కార్తీక మాసంలో పంచ రామాలకు మియాపూర్ డిపో-1 నుంచి ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీతో బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు డీఎం సింగం రామయ్య మంగళవారం తెలిపారు. ఈ ప్రత్యేక బస్సులు మియాపూర్ డిపో-1 నుంచి నవంబర్ 3, 10, 17, 24వ తేదీల్లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఎంజీబీఎస్ మీదుగా అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోటలోని ఐదు శివాలయాలను దర్శించుకుని హైదరాబాద్‌కు రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటలకు మియాపూర్‌కు చేరుతుందన్నారు. ప్యాకేజీ ధర ఒక్కొక్కరికి రూ. 3,230గా నిర్ణయించినట్లు డీఎం తెలిపారు. ఆన్‌లైన్‌తోపాటు సమీప బస్టాండ్‌లలోని ఆర్టీసీ రిజర్వేషన్ కౌంటర్ల ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చని, వివరాలకు 99592 26153, 76590 29882 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

ఆర్టీసీ మియాపూర్ డిపో-2 ఆధ్వర్యంలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 11-12 వరకు నిర్వహిస్తున్నట్లు డీఎం వెంకటేశం మంగళవారం తెలిపారు. మియాపూర్, నిజాంపేట, బాచుపల్లి, మల్లంపేట్, చందానగర్, లింగంపల్లి పరిసర ప్రాంతాల ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బస్సు సేవల సర్వీసుల మెరుగుకు దోహదపడాలని కోరారు. ప్రయాణికులు తమ సూచనలు, సలహాలను సెల్: 9959226420 కాల్ చేసి తెలియజేయాలని డీఎం కోరారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మాదాపూర్, అక్టోబర్ 29: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణ మోహన్ తెలిపిన ప్రకారం.. మాదాపూర్‌లోని నీరూస్ జంక్షన్ వద్ద ఈనెల 29వ తేదీన సాయంత్రం గుర్తు తెలయని వ్యక్తి మృతదేహం ఫుట్‌పాత్‌పై పడి ఉన్నది. స్థానికులు సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని వ్యక్తిని పరిశీలించిన చూడగా చనిపోయినట్లు గుర్తించారు. మృతుడు శరీరంపై ఎరుపు, ఆకుపచ్చ రంగు చొక్కా, తెలుపు రంగు ప్యాంటును ధరించి ఉన్నాడు. కాగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు మాదాపూర్ పోలీస్‌స్టేషన్ 83310 13220, 8712568222 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బీసీఏ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 29: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీసీఏ ప్రాక్టికల్ పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీసీఏ మొదటి, మూడు, అయిదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షలను వచ్చే నెల 7 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఈ, ఎంటెక్ పరీక్షా ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈ, ఎంటెక్ మూడో సెమిస్టర్ రెగ్యులర్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో మంగళవారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు)కింది విధంగా ఉన్నాయి. టమాట 35, వంకాయ 45, బెండకాయ 65, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 70, కాకరకాయ 45, బీరకాయ 55, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 115, క్యారెట్ 55, కాలీఫ్లవర్ 23, దొండ 50, చిక్కుడు 100, గోరుచిక్కుడు 55, బీట్‌రూట్ 35, క్యాప్సికం 75, ఆలుగడ్డ 36, కీరా 31, దోసకాయ 40, సొరకాయ 25, పొట్లకాయ (1) 23, కందగడ్డ 65, ఉల్లిపొరక 60, ఉల్లిగడ్డ 45, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 37, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 40, గుమ్మడికాయ 40, నిమ్మకాయలు(12) 50 నుంచి 60, మునగకాయ(1)8 నుంచి 10, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 160, వెల్లుల్లి 380, చింతపండు 140, కరివేపాకు 70గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

మాయమాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- పన్నులు పెంచడం కాదు.. సమస్యలు పరిష్కరించండి
- ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29: అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని, కాలనీలు, బస్తీల్లో ప్రజా సమస్యలను పరిష్కరించడం మానేసి.. పన్నులు పెంచడంపై దృష్టి సారించిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఫతేనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో ఎమ్మెల్యే కృష్ణారావు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలు మెచ్చేలా పాలన చేశారని, నగరాన్ని రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దారన్నారు. ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల కాలంలో వాగ్దానాలు నెరవేర్చడం మానేసి ప్రతిపక్షాలపై కక్షపూరిత చర్యలకు పాల్పడుతుందన్నారు. ప్రజా సమస్యలను గాలికి వదిలి... సమస్యల పరిష్కారానికి నిధులు కేటాయించక దిక్కులు చూస్తున్నారని విమర్శించారు. కొత్తగా ఒక్క పనిని కూడా ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం మానేసి పన్నులు పెంచడంపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని విమర్శించారు. ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, కాలనీలు, బస్తీల్లో పర్యటించి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి పోరాడాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీశ్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు భిక్షపతి, కె.రాములు, ఎన్.సుదర్శన్ రెడ్డి, బాలకృష్ణ శశి, నందకుమార్, శంకర్ గౌడ్, అఫ్జల్, సలావుద్దీన్, గౌస్, రాము, రాజ్‌కుమార్, సతీశ్, మహేంద్ర, సాగర్, రాంరెడ్డి, భాగ్య, డేవిడ్, సురేందర్, శిల్ప, కృష్ణకుమారి, బేగం, రహీమా, బాలమణి, జ్యోతి గౌడ్, బీఆర్ఎస్ పార్టీ నేతలు కార్యకర్తలు ఉన్నారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి..

మూసాపేట, అక్టోబర్ 29: నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తున్నమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మూసాపేట డివిజన్ పరిధిలోని రామారావునగర్, కబీర్‌నగర్‌లలో డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, జీహెచ్ఎంసీ అధికారులు డీఈ శ్రీదేవి, టౌన్ ప్లానింగ్ అధికారిణి ప్రభవతి, ఏఈ రంజిత్, జలమండలి మేనేజర్ విలియం లతో కలసి మంగళవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా రామారావు నగర్, కబీర్‌నగర్‌లలో కొనసాగుతున్న నాల పనులను ఆయన పరిశీలించారు. కృష్ణారావు మాట్లాడుతూ.... కాలనీలలో, బస్తీలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. రామారావునగర్, కబీర్‌నగర్‌లలో నిర్మిస్తున్న నాలలపై స్లాబులు ఏర్పాటు చేసి సకాలంలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలని ఆయన కోరారు. నియోజకవర్గంలోని ప్రజలకు తాము ఎల్లప్పుడు అందుబాటులో ఉంటామని ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆయన వెంట సీనియర్ నాయకులు సత్యనారయణ, డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, సత్యం, తిరుపతి, వినోద్, జోసఫ్, బోడ శ్రీనివాస్, మజీద్, వివిధ కాలనీల సంక్షేమ సంఘం అధ్యక్షులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామారావునగర్‌లో పాదయాత్ర నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జీహెచ్ఎంసీ అధికారులు

క్యూబాపై అమెరికా ఆంక్షలు వెంటనే ఉపసంహరించుకోవాలి

షాపూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు, కార్యకర్తలు

క్యూబాపై అమెరికా వైఖరికి సీఐటీయూ నిరసన ప్రదర్శన

దుండిగల్, అక్టోబర్ 29 : క్యూబాపై అమెరికా ఆంక్షలను వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ నేతలు డిమాండ్ చేశారు. క్యూబాపై ఆంక్షలు విధించాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా నిర్వహించిన సంఘీభావ ప్రదర్శనల్లో భాగంగా కుత్బుల్లాపూర్ సీఐటీయూ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతుబజార్ నుంచి సాగర్ హోటల్ చౌరస్తా వరకు అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా ప్రజలకు సంఘీభావంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు అశోక్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ.. క్యూబాపై అమెరికా అనేక ఏండ్లుగా నిర్బంధాన్ని ఆంక్షలను విధిస్తూ ఆర్థిక వాణిజ్యాన్ని దెబ్బతీస్తుందని, దీంతో క్యూబా ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 2024 అక్టోబర్ 28, 29 తేదీల్లో ఐక్యరాజ్య సమితి సాధారణ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ నేపథ్యంలో క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాదం విధించిన ఆంక్షలను ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితిలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు పసుల అంజయ్య, ఈ.దేవదానం, ఆది, నాగరాజు బి, సత్యం, పి.శంకర్‌సందీప్, జాకీర్‌హుస్సేన్, ముక్తార్, నాగేశ్వరరావు, కృష్ణ, లక్ష్మణరావు, వివిధ కంపెనీల కార్మికులు పాల్గొన్నారు.

సీఐటీయూ నిరసన

బాలానగర్, అక్టోబర్ 29 : క్యూబాపై అమెరికా సామ్రాజ్యవాద నిరంకుశ విధానాన్ని ఖండిస్తూ బాలానగర్‌లో సీఐటీయూ నిరసన ప్రదర్శన చేపట్టింది. మంగళవారం బాలానగర్ నర్సాపూర్ చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి సీఐటీయూ సీనియర్ నేత బీఎన్ సుదర్శన్, సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ హాజరై మాట్లాడారు. గత 31 ఏండ్లుగా జనరల్ అసెంబ్లీ క్యూబాకు వ్యతిరేకంగా అమెరికా విధించిన ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక దిగ్బంధానికి ముగింపు పలకాలనే తీర్మానాన్ని ఆమోదించింది. క్యూబా తీవ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా అమెరికా ముద్ర వేసిందన్నారు. ఈ నిబంధనల కారణంగా దిగుమతులు పూర్తిగా తగ్గిపోయాయని తెలిపారు. కార్యక్రమంలో మల్లేశ్, లక్ష్మి, సబితా, నాని, వనిత, తదితరులు పాల్గొన్నారు.

రూ.80లక్షలతో బౌరంపేట్‌లో భూగర్భ డ్రైనేజీ

పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

భూగర్భ డ్రైనేజీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణికృష్ణ

దుండిగల్, అక్టోబర్ 29: దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, 20వ వార్డు, బౌరంపేట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం (ఇందిరమ్మకాలనీ), లక్ష్మీనగర్‌లో రూ.80లక్షల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, దుండిగల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ సుంకరి కృష్ణవేణికృష్ణతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో కొత్త కొత్త కాలనీలు ఏర్పాటు అవుతున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శంభీపూర్ కృష్ణ, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మురళీయాదవ్, బెంబడి బుచ్చిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డిల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి తిరుపతిరెడ్డి, సలహాదారులు కామేశ్వర్‌రావు, కాలనీ వాసులు లక్ష్మణ్, శ్యామ్, బాబీ తదితరులు పాల్గొన్నారు.

అక్షిత ఫౌండేషన్ కృషి అభినందనీయం

పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు అక్షిత ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గాజులరామరం డివిజన్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అక్షిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విద్యార్థులకు నోట్‌బుక్స్, పుస్తకాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థుల విద్య ప్రమాణాలు పెంచేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధికి అక్షిత ఫౌండేషన్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్‌రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు విజయరాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్‌రాజ్, అడ్వకేట్ కమలాకర్, ఉపాధ్యక్షులు ఇబ్రహీంఖాన్, నవాబ్ భాయ్, ముసాఖాన్, గోవర్ధన్‌రెడ్డి, సురేశ్, సుంకరి చందు, వెంకటేశ్, నవీన్, శేఖర్, మహిళా అధ్యక్షురాలు సంధ్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సభ్యత్వ నమోదు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో 11, 12, 13 వార్డుల్లో మంగళవారం బీజేపీ మహిళా మోర్చా కార్యకర్తలు ఇంటింటా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సరితా రావు, మాధురి మాట్లాడుతూ.. నరేంద్రమోదీ పాలనలో బీజేపీ సభ్యత్వ నమోదుకు యువత, మహిళల నుంచి విశేష స్పందన ఉందన్నారు. కౌన్సిలర్ సూర్యకళ, మహిళా మోర్చా నేతలు ప్రియాంక, దీపిక, ఉషా, సునీత, కావ్య తదితరులు పాల్గొన్నారు. *-కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29*

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 29: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులైన బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ కోర్సుల మొదటి, మూడు, ఐదో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 11లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఎంఈడీ రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 11లోగా, రూ.200అపరాధ రుసుముతో 12లోగా చెల్లించవచ్చని చెప్పారు. బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఐడీ, ఎల్‌డీ, హెచ్ఐ, ఏఎస్‌డీ) రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 14లోగా, రూ.200 అపరాధ రుసుముతో 16లోగా కళాశాలల్లో చెల్లించాలన్నారు. పరీక్షలు వచ్చే నెలలో నిర్వహిస్తామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామన్నారు.

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(ఏఎంఎస్ కళాశాల) పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ అధికారులు తెలిపారు. ఈ కోర్సు మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత కళాశాలల్లో తీసుకోవాలన్నారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కోపేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి వచ్చే నెల8లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, రూ.200 అపరాధ రుసుముతో 11 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబుపత్రాల నకలు కోసం ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించి వచ్చే నెల 14లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శ్రీధన్వంతరి స్వామి వారి ప్రతిష్ఠ-హోమం

బాలానగర్, అక్టోబర్ 29: శ్రీధన్వంతరి స్వామి వారి ప్రతిష్ఠ, సామూహిక కల్యాణం వేడుకలు కోలాహలంగా జరిగాయి. మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధి సాయినగర్‌లోని సాయి నాగేంద్రాలయంలో ఆలయ చైర్మన్ అంబటి సునీల్‌కుమార్‌గుప్త ఆధ్వర్యంలో ఫౌండర్ చైర్మన్ అంబటి ప్రసాద్‌రావు పర్యవేక్షణలో ఉదయం 8.30 గంటలకు అభిషేకం, 11 గంటలకు స్వామివారి సామూహిక కల్యాణం, ధన్వంతరి హోమం, లక్ష్మీ నారాయణ ఇష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. సాయంత్రం స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. తద్వారా ధన్వంతరి వేడుకలు, స్వామివారి సామూహిక కల్యాణ వేడుకలు నేటితో ముగిశాయి. ఈ వేడుకల్లో వినాయక్‌నగర్, సాయినగర్, కల్యానినగర్, నవజీవన్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు, కోశాధికారి యుగంధర్‌లతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ గాంధీ

మాదాపూర్, అక్టోబర్ 29: నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్‌లోని హైటెక్ ఫుడ్ కోర్టు నుంచి యశోద హాస్పిటల్ వరకు, భారత్ పెట్రోల్ పంపు నుంచి హైటెక్ సిటీ ఫ్లైఓవర్ వరకు రూ.262 కోట్ల వ్యయంతో చేపడుతున్న సర్వీస్ రోడ్డు విస్తరణ పనులను మంగళవారం స్థానిక పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ట్రాఫిక్ సమస్యలతో వాహనదారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకొని సర్వీస్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. రోడ్డు విస్తరణ పనులతో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరుతుందన్నారు. నాణ్యతతా ప్రమాణాలతో పనులను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ శర్మ, నాయకులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్‌లతో పాటు కాలనీవాసులు ఉన్నారు.

బొటానికల్ గార్డెన్‌లో బర్డ్‌వాక్ నేచర్ క్యాంపు

కొత్తగూడలోని బొటానికల్ గార్డెన్‌లో బర్డ్‌వాక్ నేచర్‌క్యాంపులను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ

శేరిలింగంపల్లి, అక్టోబర్ 29 : తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) బొటానికల్ గార్డెన్‌లో మంగళవారం బర్డ్‌వాక్, వర్చువల్ వైల్డ్‌సఫారీ కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మాణ్ సంస్థ సౌజన్యంతో డీబీఎస్ టెక్ కార్పొరేట్ కంపెనీ నుంచి 68 మంది ఔత్సాహికులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏకో టూరిజం అసిస్టెంట్ డైరెక్టర్ తనూజ జెండా ఊపి ప్రారంభించారు. పక్షుల వీక్షణ, నేచర్‌వాక్‌కు వచ్చిన వారికి ఏకో టూరిజం ప్రాజెక్టు మేనేజర్ సుమన్, ప్లాంటేషన్ మేనేజర్ లక్ష్మణ్ బొటానికల్ గార్డెన్‌లోని వివిధ రకాల మొక్కలు, థీమ్ పార్కులతోపాటు గార్డెన్ విశేషాలను వివరించారు. పక్షుల వీక్షణ కార్యక్రమాన్ని సందర్శకుల సౌకర్యార్థం ప్రతి రెండు నెలలకు ఒకసారి వివిధ పార్కులు, అడవుల్లో నిర్వహించనున్నట్లు టీజీఎఫ్‌డీసీ ఏకో టూరిజం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రంజిత్‌నాయక్ తెలిపారు. నేచర్ క్యాంపులు ప్రతివారం నిర్వహిస్తామన్నారు.

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ.. కబడ్డీ మహిళా జట్టు ఎంపిక

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ కబడ్డీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ సెక్రటరీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్ఎస్ దిలీప్ తెలిపారు. వర్సిటీలో మంగళవారం నిర్వహించిన ఎంపిక పోటీలను వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ ఎన్ఎస్ దిలీప్, ఫిజికల్ డైరెక్టర్ నల్లగొండ అశోక్, డీఈ అరుణకుమారి, చీఫ్ సెలక్టర్ సోమేశ్వర్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు కుమార్ యాదవ్ పరిశీలించారు. ఈ పోటీల్లో 90 మంది క్రీడాకారులు పాల్గొనగా.. ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారిణిలతో జట్టును ఎంపిక చేశారు. చైన్నైలోని కరైకుడి వర్సిటీలో నవంబర్ 20 నుంచి 25వ తేదీ వరకు సౌత్‌జోన్ కబడ్డీ పోటీలు నిర్వహించడం జరుగుతుందని, ఎంపిక చేసిన జట్టు.. ఆ పోటీల్లో పాల్గొంటుందని ఆయన తెపారు. *-కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబర్ 29*

కుత్బుల్లాపూర్ ఓటర్ జాబితా విడుదల

ఓటర్ జాబితాను విడుదల చేస్తున్న ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నర్సింహ

కుత్బుల్లాపూర్, అక్టోబర్ 29:కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన ఓటర్ జాబితాను మంగళవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ ఉప కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి నర్సింహ విడుదల చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 7,31,517 ఉండగా, వీరిలో పురుషులు 3,81,406, స్త్రీలు 3,49,946 ఇతరులు 165, సర్వీస్ ఓటర్లు 104 మంది ఉన్నట్లు వెల్లడించారు. దీనిపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా నవంబర్ 28వ తేదీ వరకు ఫారం 6, 7, 8, 8ఏ ద్వారా ఫిర్యాదులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన